రైతు భరోసాలో.. కోతలు



2.29 ఎకరాలకు 8 గుంటలకే డబ్బులు వచ్చాయి

పాన్‌గల్ మండల పరిధిలోని చిక్కేపల్లిలో మాకు 2.29 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో కేవలం 8 గుంటలకు రూ. 2850 రైతు భరోసా కింద అందింది. వెంటనే వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి అడిగితే తమ వద్ద ఎలాంటి సమస్యలేదని, పై నుంచే రావడంలేదని సమాధానం చెప్పారు. మొత్తం భూమి సాగు చేస్తున్న మాకు రైతు భరోసా సాయం పూర్తిగా అందించాలి.

- ముంత నాగమణి, మహిళా రైతు, చిక్కేపల్లి వనపర్తి జిల్లా



రైతు భరోసా సమస్యలపై వనపర్తి జిల్లా పాన్‌గల్ వ్యవసాయ కార్యాలయానికి భారీగా వచ్చిన రైతులు(ఫైల్)

- రైతుకు సంబంధించిన మొత్తం విస్తీర్ణానికి డబ్బులు జమచేయని పరిస్థితి
- ఎకరంన్నర ఉంటే ఎకరాకు.. రెండెకరాలు ఉంటే ఎకరానికే జమ
- రబీలో సాగు చేయలేదని, 8 సీజన్ల సాగు ప్రకారమని అధికారుల వెల్లడి
- ఏ జాబితా ప్రకారం పడుతున్నాయో తెలియక పొంతనలేని సమాధానాలు
- ఆందోళనతో వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతులు
- భరోసా సాయం చేస్తూ అభాసుపాలు.. లోపం ప్రభుత్వానిదా?.. అధికారులదా?

మహబూబ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రైతులకు పంటసాగులో పెట్టుబడి కోసం గత ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతున్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరాకు సంవత్సరానికి రూ. 10 వేల చొప్పున అందజేయగా కాంగ్రెస్ ఆ సాయాన్ని రూ. 12 వేలకు పెంచింది. గడిచిన రెండు సీజన్ల నుంచి రైతు భరోసా డబ్బులు జమ అవుతున్నాయి. యాసంగి సీజన్‌లో రైతులకు పూర్తి స్థాయిలో సాయం అందక పోగా ప్రస్తుత వానా కాలం సీజన్‌లో రైతు భరోసా పంపిణీ ప్రారంభం కాగా అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. కొందరికి భూమి ఉన్నా మెత్తమే డబ్బులు పడకపోవడం ఒకటైతే మరొకరికి ఉన్న భూమి మొత్తం విస్తీర్ణంలో కొంతమేరనే డబ్బులు జమ అవుతున్నాయి. మొత్తం విస్తీర్ణానికి డబ్బులు పడకపోవడంతో రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా వారి నుంచి కూడా పొంతనలేని సమాధానాలు వస్తున్నాయి. కొందరు సాగుకు యోగ్యం కాని భూములని సమాధానమిస్తుండగా మరికొందరు గత సీజన్‌లో పంట సాగుచేయలేదనే కారణం చెబుతున్నారు.. ఇంకొందరు 8 సీజన్ల సగటు పంటల సాగును పరిగణనలోకి తీసుకొని డబ్బులు జమ చేస్తున్నారని రైతుల వద్ద ప్రస్తావిస్తుండగా కొందరు శాటిలైట్ ఇమేజింగ్ ద్వారా పంటలసాగును నమోదు చేశారని, దాని ప్రకారమే ఈ డబ్బులు పడుతున్నాయని అంటున్నారు. అసలు ఏ జాబితా ప్రకారం డబ్బులు వేస్తున్నారో కూడా తెలియడంలేదని పలువురు చెబుతున్నారు. ఇంత గందరగోళం మధ్య రైతులు డబ్బులు ఎందుకు జమ కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.



ఎందుకిలా..

గత ప్రభుత్వంలో సాగుకు యోగ్యం కాని భూములకు కూడా రైతుబంధు వేశారని విమర్శలు వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించి వాటిని తొలగించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 33182 ఎకరాలను

(మిగతా 6లో..)

● వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమాలొద్దిన్‌పూర్ క్లస్టర్ పరిధిలో 1979 మంది రైతులు ఉండగా 3507.20 ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉన్నది. రైతు భరోసా పథకం కింద రూ. 1,75,36,005 జమ చేయాల్సి ఉండగా ప్రస్తుతం 1923 మంది రైతులకు సంబంధించి 3474.22 ఎకరాల భూమికి రూ. 1,73,71,119 రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ క్లస్టర్ పరిధిలో ఇంకా రైతు భరోసా జమ కొనసాగుతుండగా దాదాపు 33 మంది రైతులకు తమకు ఉన్న సాగుకు యోగ్యమైన భూమి విస్తీర్ణం కంటే తక్కువ డబ్బులు పడినట్లు సమాచారం.

● నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తోటపల్లి క్లస్టర్ పరిధిలో తోటపల్లి, వేపూరు, బెక్కెర, సుద్దకల్ గ్రామాల రైతుల భూములు ఉన్నాయి. మొత్తం 2576 మంది రైతులకు గాను 5634 ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉన్నది. ఇప్పటివరకు పథకం కింద 2479 మంది రైతులకు రూ. 3,74,83,941 నగదు జమ అయ్యింది. ఉన్న విస్తీర్ణం కంటే దాదాపు 17 మంది రైతులకు నగదు తక్కువగా పడిందని తెలుస్తోంది. వీరంతా వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సర్వే సమయంలో సరిగ్గా వివరాలు నమోదు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తడం కారణంగా తెలుస్తోంది.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం

- తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యమేనని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శ్రీశైలం దైవ దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళుతూ అమ్రాబాద్ మన్ననూరు అటవీశాఖ అతిథి గృహం వద్ద ఆగిన మహేష్ కుమార్ గౌడ్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి సన్మానించారు. మన్ననూరు గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రారంభంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి శనివారం భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ హయాంలో పూరి గుడిసెల్లో నివసించే నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించే ప్రక్రియ ప్రారంభించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని, మొదటి విడతలో ఇళ్ల మంజూరు పత్రాలు రాని వారు అధైర్య పడవద్దన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మంతటి బాలమ్మ, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు పిట్టల సురేష్, చత్రూనాయక్, బుచ్చయ్య, పెర్మల వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, రాజారాం, రహిమాన్, రవికుమార్, వెంకటయ్య, గెలువయ్య, తుల్యా, రాజు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ గొంతుక సాయిచంద్

- తెలంగాణ ఏర్పాటులో తనదైన పాటల శైలితో ముద్ర
- 'రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా' పాటతో అరంగేట్రం
- నేడు అమరచింతలో రెండో వర్ధంతి, విగ్రహావిష్కరణ, భారీ బహిరంగ సభ
- హాజరు కానున్న కేటీఆర్, హరీశ్‌రావు

6



వేదికపై పాట వినిపిస్తున్న సాయిచంద్(ఫైల్)

వంగూరుకు వరం

- ఒకే గొడుగు కిందికి ప్రభుత్వ పాఠశాలలు
- పేద విద్యార్థులకు చక్కటి అవకాశం
- ఒక్కో పాఠశాలకు రూ.12 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం

6



వంగూరులో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆకునూరి మురళి(ఫైల్)

అలంపూర్ ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింత

- పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు
- మంత్రి పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు

7



ఎందుకు పంపడంలేదని పోలీసులతో వాగ్వాదానికి దిగిన నాయకుడు

జాతీయ స్థాయికి ఎదగాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- పాలమూరులో రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు ప్రారంభం

6



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మంత్రి పర్యటనతో సమస్యలు పరిష్కారమయ్యేనా?

- జూరాల ప్రాజెక్టు పూడికతీతతో పూర్వవైభవానికి హామీ
- నాలుగేళ్లుగా 2టీఎంసీలకే ర్యాలంపాడు పరిమితం
- నెట్టెంపాడు వ్యయం అంచనాల పెంపుతో పూర్తయ్యేనా?
- ఆశలు రేకెత్తించిన మంత్రి ఉత్తమ్ కుమార్

గద్వాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల రోపులు పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు గద్వాలకు వచ్చారు. జూరాల ప్రాజెక్టుతో పాటు ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పరిశీలించిన మంత్రులు గద్వాల కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. అనేక హామీలు ఇచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టులకు పూర్వవైభవం తీసుకవస్తామని హామీ ఇచ్చారు. జూరాల ప్రాజెక్టులో ఆపరేషన్ మెయింటెనెన్స్‌ను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేదని అందుకే ప్రాజెక్టులో రోప్స్ పాడైపోవడం, గ్యాంటీ క్రేన్ పనిచేయకపోవడం వంటివి జరిగాయని చెప్పారు. తాము పక్కాగా నిర్వహణ చేస్తామని గేట్ల మరమ్మతులు పది రోజుల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రూ.3.50కోట్లతో మరో కొత్త గ్యాంటీ క్రేన్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రాజెక్టుపై భారీ వాహనాలు వెళ్లకూడదని నిపుణుల కమిటీ నివేదించిందని గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం చేయలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో జూరాల కింద కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ.100కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి ఇచ్చిన హామీ నెరవేరితే గద్వాల, ఆత్మకూర్, అమరచింత మధ్య వ్యాపార సంబంధాలు పెరిగి అభివృద్ధి చెందుతాయని ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నెట్టెంపాడు, తుమ్మిళ్లపై మంత్రి హామీలు అమలు అయితే నడిగడ్డ సస్యశ్యామలం అవుతుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ గట్టు ఎత్తిపోతల పథకం పనుల పర్యవేక్షణకు వచ్చి ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలను అరికట్టి 4టీఎంసీలు నిల్వ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఖరీఫ్ నాటికి లీకేజీలు అరికట్టాల్సి ఉండగా కాలయాపన జరిగింది. మళ్లీ మంత్రి ఇప్పుడు 4టీఎంసీలు నిల్వచేసేందుకు సీడబ్ల్యూసీ లాంటి సంస్థతో సర్వే చేస్తున్నామని ఎంత ఖర్చు అయిన 4టీఎంసీల నిల్వ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ వచ్చే ఖరీఫ్ నాటికైన పూర్తయితే చాలని రైతులు కోరుతున్నారు.



ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చిత్రంలో సరిత

నెట్టెంపాడులో 90శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా పదిశాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికోసం నెట్టెంపాడుపై రూ.2753కోట్లతో రివైజ్‌డ్ అంచనాలు తయారు చేశామని, డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దీని ద్వారనైనా పెండింగ్ కాలువల నిర్మాణం, లైనింగ్ పనులు పూర్తయితే సాగునీటి సమస్యలు తీరుతాయని రైతులు అంటున్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగమైన మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి భూ పరిపాలన అనుమతులు ఉన్నప్పటికీ భూసేకరణ జరగలేదు. రైతులు అడ్డుకుంటున్నారు. అయితే మంత్రి త్వరలో భూసేకరణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇది నెరవేరితే ఆర్డీయస్‌లో చివరి ఆయకట్టు రైతుల సాగునీటి కష్టాలు తీరే అవకాశం ఉంది. అయితే మంత్రి ఇచ్చిన హామీలు వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తయితే నడిగడ్డలో సాగునీటి సమస్యలు తీరుతాయని, ఏదో వచ్చాము.. చెప్పాము అనిపోతే కథ మళ్లీ మొదటికి వచ్చే అవకాశం లేకపోలేదు.



జూరాల ప్రాజెక్టుపై గేట్ రోప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మెరుగైన విద్య అందించాలి

- తాడూరు కేజీబీవీ పాఠశాలలో కలెక్టర్ బదావత్ సంతోష్

తాడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని పాఠశాలలతో పాటు అన్ని విద్యా సముదాయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి విద్య అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం తాడూరు మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంతో పాటు మేడిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కోసం చర్యలు, కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బోధన పాఠ్య పుస్తకాలు తదితర అంశాలను తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ అడిగి తెలుసుకుని విద్యాబోధనను గమనించారు. కేజీబీవీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమైన సీఈసీ ఇంటర్మీడియట్ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమైనందున అదనపు తరగతి గదుల మంజూరు, సోలార్ హీటర్ రిపేరు, పాఠశాల లోపలి ఆవరణలో ఫ్లోరింగ్ మరమ్మతులు, కేజీబీవీ ప్రాంగణం క్రీడా స్థలంగా మార్చేలా గ్రౌండ్ లెవెలింగ్, నీటి వసతి సౌకర్యాలపై కేజీబీవీ ప్రత్యేక అధికారిణి విజయ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వసతుల కల్పనకు హామీ ఇచ్చారు.



తాడూరు కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రమాదంలోనే జూరాల ప్రాజెక్టు

- మంత్రి చెప్పిన మాటలు అబద్ధం
- సొరంగంలో బురద పేరుకుని తేమ శాతం పెరిగితే భారీ నష్టం
- మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి

7

కరెంటు షాక్ తగిలి రైతు మృతి

7

వస్తున్నారు.. వెళ్తున్నారు!

- నెలకే సెలవుపై వెళ్లిన గట్టు తహసీల్దార్
- మూడు నెలల్లో ముగ్గురు తహసీల్దార్ల బాధ్యతలు

7

రేపటితో రేషన్ గడువు

- తీసుకోవాలంటున్న జిల్లా అధికారులు - 28 నాటికి 85 శాతం పూర్తి



దేవబండలో రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

అయిజ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీ సోమవారంతో ముగియనుంది. అధికారులు ఈనెల 30న ఆఖరు అంటున్నారు. ఇప్పటికీ 85 శాతం మాత్రమే పంపిణీ జరిగినట్లు అధికారులే చెబుతున్నారు. ఇంకా 15 శాతం లబ్ధిదారుల మాటేమిటి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి 3 నెలల బియ్యాన్ని జూన్ నెలలోపే పంపిణీ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 13 మండలాల్లో 335 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి కుటుంబ సభ్యుడికి నెలకు 6 కిలోల చొప్పున 3 నెలలకు సంబంధించి 18 కిలోలు అందిస్తున్నారు. జిల్లా మొత్తంగా 1,56,707 రేషన్ కార్డులు ఉన్నాయి. నెలకు 35,914 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారుకు అందచేయబడుతోంది. 3 నెలలకు సంబంధించి మొత్తం 1,07,742 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉంది. 91,580 మెట్రిక్ టన్నుల బియ్యం అంటే దాదాపు 85 శాతం బియ్యం పంపిణీ శనివారం నాటికి అందించినట్లు అధికారులు చెబుతున్నారు. గడువు పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాగా, ఈ నెల 30 లోపు బియ్యం తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామికుమార్ తెలిపారు.

అప్రమత్తతతోనే వ్యాధుల నివారణ

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అల్లే శ్రీనివాసులు



ప్రసవమైన తల్లి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అల్లే శ్రీనివాసులు

పెబ్బేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతోనే వ్యాధుల నివారణ సాధ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అల్లే శ్రీనివాసులు తెలిపారు. శనివారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనరల్ ఓపి, డెలివరీ, ఇన్ పేషెంట్ రిజిస్టర్లు, రోగులను పరిశీలించారు. మునిసిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపైన ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. వంద శాతం ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు అయ్యేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలు, రంగాపూర్ గ్రామంలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. మండల వైద్యాధికారి ప్రవళిక, హెల్త్ సూపర్‌వైజర్ నరసింహరావు, రాజేష్ గౌడ్, కుమారి, కృష్ణ, చరిత, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి పూజలు



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలోని జేష్టదేవి సమేత శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జ్యేష్టాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండలంలోని నందివడ్డెమాన్ నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, రాజేష్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నారసింహుడి అభిషేకానికి వెండి శంఖం అందజేత



శ్రీలక్ష్మీనరసింహస్వామి అభిషేకానికి వెండి శంఖు అందజేస్తున్న దాతలు

తిమ్మాజిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామి అభిషేకానికి సంబంధించి రూ.40వేల విలువైన వెండి శంఖును శనివారం మరికల్ గ్రామానికి చెందిన పోలేపల్లి స్వరూపాశేఖర్‌రెడ్డి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వారిని శాలువాతో సన్మానించి, వేద పండితులు గంగాధర శర్మ ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, చంద్రమౌళి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగిరెడ్డి, జంగయ్య, నరసింహ, సుందరయ్య పాల్గొన్నారు.

క్రీడా అకాడమీకి గిరిజన విద్యార్థి ఎంపిక



హనుమకొండలోని క్రీడా అకాడమీకి ఎంపికైన గిరిజన విద్యార్థినికి శాలువా కప్పి సన్మానిస్తున్న ఎంఈవో సత్యనారాయణశెట్టి

తిమ్మాజిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న ముడావత్ మిట్టు అనే గిరిజన విద్యార్థి హనుమకొండ క్రీడా అకాడమీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఎంపికైన విద్యార్థిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. డిస్కస్త్రోలో మంచి ప్రావీణ్యం చూపించినందుకు రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు సామ్సన్, జంగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ, అశోక్ పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జడ్చర్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలతో పాటు అనుమతుతి లేకుండానే బిల్డింగ్ మార్చిన పాఠశాలలకు శనివారం జడ్చర్ల మండల విద్యాశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. 'సీబీఎస్‌ఈతో గాలం' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అనుమతి లేకుండా పాఠశాలలు నడుపుతున్న పంచవేద విద్యామందిర్, వృక్ష గ్లోబల్ స్కూల్, యూరో కిడ్స్ స్కూల్, ఐ స్కూల్, దీవన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు నోటీ సులు జారీ చేసినట్లు ఎంఈవో మంజులాదేవి తెలిపారు. అలాగే పర్మిషన్ లేకుండానే మరో బిల్డింగ్‌కు షిఫ్ట్ చేసిన గీతం పాఠశాల మేనేజ్‌మెంట్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జారీ చేసిన నోటీసులకు రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకుంటే నిబంధన ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలమూరుకు సాగునీటిపై హైదరాబాద్‌లో సదస్సు



కరపత్రాలు విడుదల చేస్తున్న పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు

పాలమూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీటి సాధన, పరిశ్రమల కాలుష్యం నుంచి రక్షణ, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం కోసం హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల చేసి, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన పోరాట కాలమంతా ఉమ్మడి జిల్లాకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాలను ఎత్తి చూయించామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత మన జిల్లా వనరులను మన జిల్లాకు వినియోగించి ప్రజల కష్టాలు తీరుస్తారనుకుంటే పాలకులు ఆపని చేయలేదన్నారు. కృష్ణ, తుంగభద్ర నదుల నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు నిర్మించి నీటితో నింపి సాగుయోగ్యమైన 40 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందిస్తారనుకున్నారనుకుంటే ఆర్‌డీఎస్, నెట్టెంపాడు, కల్వకుర్తి లిఫ్టులు అరకొర నీటినే అందిస్తున్నాయని తెలిపారు. జూరాల ఎన్నేళ్లయినా పూర్తిస్థాయి నీటిని అందించడంలేదన్నారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకం జూరాల నుంచి తరలించి శ్రీశైలానికి మళ్లించి డిండి - నల్గొండ ప్రాజెక్టుగా మార్చారన్నారు. ప్రజలు కష్టించి పండించుకున్న పొలాల మధ్యకు ఇథనాల్, ఫార్మా ఫ్యాక్టరీలను తీసుకొచ్చి కాలుష్యపు విషాలు చిమ్ముతున్నారని పేర్కొన్నారు. రిజర్వాయర్లు, ఫ్యాక్టరీలు, విశాలమైన రహదారుల కింద పేదల భూములను లాక్కొని నిర్వాసితులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతిలో మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి నోచుకోక కృత్రిమ కరువులతో వలసలు నిరంతరం కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లా నిజమైన అభివృద్ధికి ఈ జిల్లాలో పుట్టిన బిడ్డలుగా ఇక్కడే బతకటం కోసం ఏమి చేయాలో చర్చించేందుకు పాలమూరు అధ్యయన వేదిక రాష్ట్ర స్థాయి సదస్సును జూలై 5న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేధావులు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి, మేధావులు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారుడు జక్కా గోపాల్, డీటీఎఫ్ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఏ.తిమ్మప్ప, కో-కన్వీనర్ కేసీ వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకట్రాములు, రవీందర్‌గౌడ్, వామన్‌కుమార్ పాల్గొన్నారు.

వంగూరుకు వరం

- ఒకే గొడుగు కిందకు ప్రభుత్వ పాఠశాలలు
- పేద విద్యార్థులకు చక్కటి అవకాశం
- ఒక్కో పాఠశాలకు రూ.12 కోట్లు ఖర్చు చేయనున్న ప్రభుత్వం
- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభించేందుకు సన్నాహాలు

● తెలంగాణ పబ్లిక్ స్కూల్



వంగూరు బాలుర ఉన్నత పాఠశాల

వంగూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అం దించేందుకు విద్యా కమిషన్ సిఫారసుల మేరకు ఈ విద్యా సంవత్సరంలోనే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభించనున్నది. పైలట్ ప్రాజెక్టు కింద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వంత మండలం నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరులో, పోల్కంపల్లిలో పాఠశాలలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. వంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మారుస్తూ ఈ నూతన విద్యా సంవత్సరం నుంచే ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ స్కూళ్లను ప్రారంభిం చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటిలో ప్రవేశాన్ని అందిపు చ్చుకుంటే సర్వతోముఖాభివృద్ధి చెందేందుకు మంచి భవిష్యత్తు నిర్మించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

1500 మంది విద్యార్థులకు ప్రాథమిక విద్య

పాఠశాలలో 1500 మంది విద్యార్థుల వరకు పూర్వ ప్రాథమిక విద్య(ఎల్‌కేజీ, యూకేజీ) నుంచి జూనియర్ కాలేజ్ వరకు ఒకే క్యాంపస్‌లో ఏర్పాటు చేయను న్నారు. వంగూరులో ఉన్న ఆరు పాఠశాలలను ఒకటే దగ్గర ఏర్పాటు చేస్తారు. విద్యా కమిషన్ సూచన మేరకు ఇప్పటికే విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యావేత్తలతో పాఠశాల అభివృద్ధి కమిటీని, పే రెంట్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. పబ్లిక్ స్కూళ్లకు కావల్సిన నిధులను రాష్ట్ర విద్యాశాఖ నుంచి స మకూరుతాయి. ప్రతీ పబ్లిక్ స్కూల్‌కు రూ.12 కోట్ల నిధులను పాఠశాల పేరెంట్ కమిటీ ఖాతాలో జమ చేస్తారు. ఈ నిధులను ఖర్చు చే సేందుకు ఎంఈవో, ఏఈ, పేరెంట్స్ కమిటీ నుంచి ఎంపిక చేసిన ఆరుగురికి చెక్ పవర్ పబ్లిక్ స్కూల్ అకౌంట్ లావాదేవీలను జరిపేందుకు విద్యాకమిషన్ అధికారం కల్పించింది.

ఉచిత బస్సు సౌకర్యం

పరిసర గ్రామాల విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ద్వారా ఉదయం 8 గంటల వరకు పాఠశాలకు తీసుకొస్తారు. ఉదయం 8 గంటలకు అల్పాహారం, 9 గంటలకు ప్రార్థనతో ప్రారంభం అవుతాయి. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తారు. సాయంత్రం ఆటలు అనంతరం 5.30 గంటలకు స్నాక్స్ ఉంటుంది.

14 ఎకరాల్లో పాఠశాల ప్రాంగణం

మొత్తం విస్తీర్ణం సుమారు 14 ఎకరాలలో అన్ని రకాల వసతులను ఒకే క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తారు. ఇందుకు కావ ల్సిన భూమిని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి వంగూరును సందర్శించి గుర్తించారు. ఈ పాఠశాల క్యాంపస్‌లో రక్షిత మంచినీటి వ్యవస్థ, వాష్ రూమ్‌లు, (బాలికలకు, బాలురకు వేరు వేరుగా) ఆ ధారిత కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, భోజనశాలలు, వంటశాల, టెన్నిస్ కోర్టు, ఫుట్‌బాల్ కోర్ట్, వాలీబాల్ కోర్ట్, తదితర క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తారు.

ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉంది



పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో వంగూరులో, పోల్కంపల్లిలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందుకు గాను పాఠశాల అభివృద్ధి, నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశాం. స్కూల్‌కి కావాల్సిన స్థలాన్ని కూడా గుర్తించాం. ప్రభుత్వ ఉతర్వులు మూడు, నాలుగు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే ఈ విద్యా సంవత్సరం నుంచే స్కూల్‌ను ప్రారంభిస్తాం.

- మురళీమోహనా చారి, ఎంఈవో, వంగూరు

కంటి తుడుపుగా మంత్రి ఉత్తమ్ జూరాల పర్యటన

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కంటి తుడుపుగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జూరాల పర్యటన కొనసాగిందని మాజీ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. శనివారం జూరాల ప్రాజెక్టులో ఐరన్ రోప్‌లు తెగిన విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన పర్యటన మొక్కుబడిగా ముగిసిందని మండిపడ్డారు. జూరాలలో ఐరన్ రోప్‌లు తెగడం సాధారణం అయితే అసలు జూరాల పర్యటనకు ఎందుకు వచ్చారని నిలదీశారు. ఆ సమస్యతో ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బందులు లేకుంటే ఆగమేఘాల మీద మంత్రి పర్యటన ఎందుకు చేశారని ప్రశ్నించారు.

పర్యటనకు వచ్చిన మంత్రి స్పిల్‌వే, క్రస్ట్ గేట్లు, ఐరన్ రోప్‌లు తెగిన వాటిపై ఎందుకు పరిశీలన చేయలేదని అన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల మీద కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధిలేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ధ్వంసమైన తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ నిలబెట్టారన్నారు.

కేవలం ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరిగి సమూలంగా నాశనం చేస్తున్నారని, కాంగ్రెస్ కుట్రలకు ప్రజలు సమాధానం చెప్పడం ఖాయం అన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- పాలమూరులో రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు ప్రారంభం



కిక్‌బాక్సింగ్ చేస్తున్న క్రీడాకారులతో ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పసు కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలను ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిక్ బాక్సింగ్ టోర్నీలో జిల్లా క్రీడాకారులకు పతకాలు సాధించాలని ఆకాక్షించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. 7 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్కుల విభాగంలో పోటీలు నిర్వహించారు. 22 జిల్లాల నుంచి 600లకుపైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం పోటీలు ముగియనున్నాయి. కార్యక్రమంలో స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు, టోర్నీ ఆర్గనైజర్ రవికుమార్, కార్యదర్శి రవినాయక్, సలహాదారులు జయంత్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు పాండు రంగారెడ్డి, రాములు, మాస్టర్లు రోహిత్, నిఖిల్, యామిని, జయంత్‌కుమార్, వర్షిని పాల్గొన్నారు.

ఉద్యమ గొంతుక సాయిచంద్

- తెలంగాణ ఏర్పాటులో తనదైన పాటల శైలితో ముద్ర
- 'రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా' పాటతో అరంగేట్రం
- నేడు అమరచింతలో రెండో వర్ధంతి, విగ్రహావిష్కరణ, భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న కేటీఆర్, హరీశ్‌రావు



అమరచింత బస్టాండ్ సెంటర్‌లో సాయిచంద్ విగ్రహావిష్కరణ స్థలం



అమరచింత హైస్కూల్ గ్రౌండ్‌లో సిద్ధమవుతున్న బహిరంగ సభ వేదిక

అమరచింత, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమాన్ని తన గానంతో ఉర్రూతలూగించిన వ్యక్తి సాయిచంద్. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో అగ్గి రగిల్చాడు. కేసీఆర్ ఉన్న ఓ వేదికపై 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా' అనే పాటతో సాయిచంద్ వెలుగులోకి వచ్చాడు. సాయిచంద్ పాటకు మంత్రముగ్దులైన కేసీఆర్ కంటతడి పెట్టుకుని హృదయాన్ని హత్తుకున్నాడు. అప్పటి నుంచి తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ ప్రస్థానం మొదలైంది. 2021లో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్‌గా పదవి పొంది.. ఆ పదవిలో 19 నెలల పాటు కొనసాగి హఠాన్మరణం పొందాడు. నేడు ఆయన రెండో వర్ధంతి సందర్భంగా కథనం.



మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సాయిచంద్ (ఫైల్)

సాయిచంద్ కుటుంబ నేపథ్యం

వేద సాయిచంద్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ప్రస్తుతం వనపర్తి జిల్లాలోని అమరచింతలో 1984 ఆగస్టు 20న వెంకటరమణ, మణెమ్మ దంపతులకు రెండో సంతానంగా జన్మించాడు. స్థానికంగా 1 నుంచి 3వ తరగతి వరకు లిటిల్ ఫ్లవర్ పాఠశాల, 4 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ హై స్కూల్లో చదువుకోగా.. 2001-03 ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. 2003-6 వరకు హైదరాబాద్‌లోని విద్యానగర్‌లోని ఎస్‌వీఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేయగా.. 2007 నుంచి 2010 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు లిటరేచర్ పీజీ పూర్తి చేశాడు. పీహెచ్‌డీ అప్లయ్ చేసినప్పుడు తెలంగాణ ఉద్యమం బాట పట్టినట్లు తెలిసింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నప్పుడే పీడీఎస్‌యూ హైదరాబాద్ సిటీ సెక్రెటరీగా, అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేశాడు. ఇంటర్ చదువుతున్నప్పుడే తల్లి మృతిచెందింది. తండ్రి వెంకట్‌రాములు న్యూడెమోక్రసీ పార్టీలో చురుకైన కార్యకర్తగా ఉంటూ అరుణోదయ కళాకారుడిగా అనేక పాటలు పాడేవాడు. 2011లో సాయిచంద్ రజినిని ప్రేమ వివాహం చేసుకున్నాడు.

నేడు విగ్రహావిష్కరణ

ఈ నెల 29న సాయిచంద్ రెండో వర్ధంతి. ఈ సందర్భంగా సాయిచంద్ సతీమణి మాజీ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రజిని అమరచింతలో సాయిచంద్ విగ్రహం ఏర్పాటు చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ సభలో మాజీ మంత్రులు కేటీఆర్‌తో పాటు హరీశ్ రావు మరి కొంతమంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రముఖులు ధూం ధాం కళాకారులు సాయి అభిమానులు హాజరయ్యేలా ప్రణాళికను సిద్ధం చేశారు.

సాయిచంద్ ఆశయాలను కొనసాగిస్తా



తన భర్త సాయిచంద్ ఆశయాలను కొనసాగిస్తా. ప్రజా గొంతుకగా నిలబడి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తన భర్త రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతగానో పని చేశాడు. ఆయన గుర్తుగా ఆయన జన్మించిన అమరచింతలో విగ్రహం ఏర్పాటుతో పాటు బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. అమరచింతలో జరిగే బహిరంగ సభలో ప్రతీ ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలి.

- రజిని సాయిచంద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్, మాజీ చైర్‌పర్సన్

ఒండ్రుమట్టి తరలింపుపై మాజీ ఎమ్మెల్యే గరంగరం

- టిప్పర్లను ఆపిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- అధికారులపై ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ధన్వాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నారా యణపేట జిల్లా ధన్వాడ పెద్ద చెరువు నుంచి ఒండ్రుమట్టి తరలింపుపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అధికారులపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఒండ్రుమట్టిని తరలిస్తున్న వాహనాలను నిలిపివేశారు. సంబంధిత శాఖ అధికారులను పిలిచి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని టిప్పర్లకు అనుమతిచ్చారు?, ఎంత తీసుకెళ్తున్నారు? తదితర వివరాలను అధికారులనడిగారు. ఒండ్రుమట్టిని ముందుగా రైతుల పొలాలకు తరలించాలన్నారు. అధికారుల తప్పుడు విధానాల వల్లే ఎవరు పడితే వారు దోచుకోవడం మొదలెట్టారన్నారు.

చెరువులో ఉన్న ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను అన్నింటిని పంపించాలని అధికారులను ఆదేశించారు. అడిగే వారు లేరనే మీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తారా అంటు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల వరకే ఒండ్రుమట్టి టిప్పర్లను బంద్ చేశారు. రామ్మోహన్‌రెడ్డి ఇలా పోయారో లేదో వెంటనే మళ్లీ ఒండ్రుమట్టి తరలింపును కొన సాగించారు.

రైతు భరోసాలో కోతలు



మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలోని వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రైతులు

(5వ పేజీ తరువాయి)

గుర్తించింది. గత సీజన్‌లో పూర్తిస్థాయిలో రైతుభరోసా పడలేదు. ఈ సీజన్‌లో కోతలు పడుతున్న నేపథ్యంలో రైతులు వెళ్లి వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తే సాగుకు యోగ్యంకాని భూమి అని సమాధానమిస్తున్నారు. అయితే తాము సాగుచేశామని, సర్వే సమయంలో ఏఈఓలతో ఫొటోలు కూడా తీసుకున్నామని రైతులు చెబుతున్నారు. ఒక్క కొల్లాపూర్ మండలంలోని 2506 మంది రైతులకు పూర్తిస్థాయిలో నగదు జమ కాలేదు. వాస్తవానికి అంతమొత్తంలో సాగుకు యోగ్యంకాని భూములు లేవు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 లక్షల ఎకరాలకు సంబంధించి రూ. 2600 కోట్లు ఈ పద్ధతిలో జమ కాలేదని సమాచారం. దీనివల్ల తీవ్రమైన గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అలాగే 8 సీజన్ల సాగును పరిగణనలోకి తీసుకుంటే కొందరు రైతులు వానాకాలంలో సాగుచేసి యాసంగిలో నీటి వసతి లేక వదిలేస్తారు. ఏ సీజన్లవి సగటుగా తీసుకున్నారో తెలియని పరిస్థితులు ఉన్నాయి. కొందరికి మాత్రం సాగుచేయకున్నా రైతు భరోసా సాయం అందినట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితిని బట్టి తెలుస్తోంది. మరికొందరికి సాగుచేసినా సాయంలో కోత పడినట్లు స్పష్టమవుతోంది.

సాయం చేసినా అభాసుపాలు..

ప్రభుత్వం రైతుల పెట్టుబడి సాయం చేస్తున్నప్పటికీ అభాసుపాలవుతోంది. దీనికి ప్రభుత్వం దగ్గర లోపం ఉన్నదా, లేదా అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారా అనేది అర్థంకావడంలేదు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతీఏటా పంటల సర్వేను చేపట్టడం విధిగా చేయాలి. దాని ప్రకారం సబ్సిడీలు, పంట కొనుగోళ్లు, పెట్టుబడి సాయాలు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ సర్వే ఇష్టారీతిన జరగడం వల్లే ప్రస్తుత ఇబ్బందులకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఏ జాబితా ప్రకారం డబ్బులు వేస్తున్నారో కూడా తెలియడంలేదని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ భూములు ఉన్న రైతులకు సాయం కొంతమేర అందకపోయినా పెద్దగా ఇబ్బందులు ఉండవు. కానీ తక్కువ భూములు ఉన్న ఎకరా, రెండెకరాల రైతులకు కోతలు విధించడం వల్ల ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులే నష్టపోతున్న పరిస్థితులు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట రైతు భరోసా సాయం వేయడం వల్ల లబ్ధి ఎక్కువగా జరుగుతుందనే ఎత్తుగడ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిన్నచిన్న తప్పిదాల వల్ల బుమరాంగ్ అయ్యే ప్రమాదం ఉందనేది స్పష్టంగా కనిపిస్తోంది. తాజా గందరగోళాన్ని సరిదిద్ది డబ్బులు మొత్తం జమచేయడం వల్ల రైతుల ఇబ్బందులు దూరమయ్యే అవకాశం ఉంది.

సినీ హీరో సుమన్‌కు సన్మానం



సినిమా హీరో సుమన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

శ్రీరంగాపూర్, జూన్ 28, (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినిమా హీరో తల్వార్ సుమన్‌గౌడ్ శ్రీరంగాపూర్ దేవాయలంలో సీరియల్ షూటింగ్‌కు వచ్చిన సందర్భంగా పెబ్బేరు, శ్రీరంగాపురం గౌడ సంఘాల నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుమన్ గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక వర్గం, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, ప్రజాసేవలో ఉండాలని అన్నారు. శ్రీరంగాపురం దేవాలయం ప్రముఖమైనదని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దేవాలయంలో చాలా సినిమా షూటింగ్ చేశామని, ప్రతీ సినిమా బాగా నడిచాయని, అందుకే శ్రీరంగనాయకస్వామి అంటే ఇష్టమన్నారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ బస్వరాజ్‌గౌడ్, ఎస్.రంగస్వామిగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

కృష్ణ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలై నెలరోజులు గడుస్తున్నా నేటికీ వర్షాలు కురవక రైతులు దిగాలు చెందుతున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం కున్సి గ్రామ రైతు మహిళలు శనివారం జల్ది బిందెలతో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విత్తిన పత్తి, కంది విత్తనాలు మొలకెత్తి వాడుపడుతున్నాయని రైతులు వాపోయారు. కొందరు రైతులు వర్షాలు కురవక విత్తనాలు పెట్టలేదని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేసినట్లు తెలిపారు.


మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్ల పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్లు ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్‌పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్ల హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్


పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురి చేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

క్రైం కార్నర్

మరణంలోనూ వీడని బంధం

- రెండు రోజుల వ్యవధిలోనే భార్యాభర్తల మృతి


నరసింహ (ఫైల్)


బాలమ్మ (ఫైల్)

పాన్‌గల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతిచెందిన సంఘటన పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లికి చెందిన నరసింహ(70) గడమల బాలమ్మ(65) ఇద్దరు దంపతులు. అనారోగ్యంతో రెండు రోజుల వ్యవధిలోనే మృతిచెందడం కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం నెలకొంది. గడమాల నరసింహ రెండు రోజుల క్రితం మృతి చెందగా... శనివారం గడమాల బాలమ్మ మృతిచెందింది. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కరెంటు షాక్ తగిలి రైతు మృతి


నార్య ఫైల్

గోపాల్‌పేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : కరెంటు షాక్ తగిలి మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ మృతి చెందాడు. బంధువులు గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బుద్దారం గ్రామ పరిధిలోని పాటిగడ్డ తండాకు చెందిన నార్యనాయక్ (60) తనకున్న మూడు ఎకరాల్లో వరి పండిద్దామని పొలాన్ని చదును చేసి తుకం పోశాడు. తుకానికి నీళ్లు పెడతామని శనివారం ఉదయం 6 గంటలకు పొలం దగ్గరికి వెళ్లాడు. మోటారును ఆన్ చేయడానికి స్టార్టర్ డబ్బాను పట్టుకోగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తన చిన్న కుమారుడు తండ్రికి ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో పక్కపొలం వారికి ఫోన్ చేసి తన తండ్రి ఫోన్ చేసినా ఎత్తడం లేదని, కొద్దిగా కనుక్కొని తెలియజేయాల్సిందిగా చెప్పాడు. వారు వెళ్లి వెతుకగా.. అప్పటికే కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

కలకలం రేపిన క్షుద్ర పూజలు

వంగూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో శనివారం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. గ్రామ సమీపంలోని వైకుంఠధామం ఎదుట రోడ్డుపై క్షుద్ర పూజలు చేశారు. నల్లకవర్‌లో జిల్లేడు పూలు పెట్టి, కొబ్బరికాయలు కొట్టి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు కోసి రోడ్డుపై పెట్టారు. దీంతో స్థానికులు, ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గడ్డి మందు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కొత్తపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పేట జిల్లా కొత్తపల్లి మండలం భూనీడు గ్రామానికి చెందిన వంటిగుంట బాలకృష్ణనాయుడు శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై గ్లైపోసేట్ 60 బాటిళ్ల గడ్డి మందు తరలిస్తున్నాడు. మండల వ్యవసాయ అధికారి రమేష్ అందించిన సమాచారంతో పోలీసులు బాలకృష్ణనాయుడు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద 60 బాటిళ్ల గడ్డిమందుతో పాటు, అందుకు సంబంధించిన లైసెన్స్, ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఏవో ఫిర్యాదు మేరకు బాలకృష్ణనాయుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలంపూర్ ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డగింత

- పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు
- మంత్రి పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు
- ప్రధాన నాయకులను మాత్రమే హెలీప్యాడ్ వద్దకు అనుమతి


అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కారును అడ్డుకుంటున్న పోలీసులు

గద్వాల క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటనలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు చుక్కెదురయ్యింది. అందరి కార్లను కాన్వాయ్‌లో పంపి ఎమ్మెల్యే విజయుడు కారును పంపకపోవడంతో కార్యకర్తలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ వద్ద చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని జూరాల ప్రాజెక్టులో ఒక గేట్ రోప్ తెగిపోవడంతో వాటిని పరిశీలించేందుకు వస్తున్న రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పశువర్ధకశాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గద్వాల కలెక్టరేట్‌లో హెలిప్యాడ్‌కు వస్తున్న తరుణంలో జిల్లా పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ఈ క్రమంలో మంత్రులకు అందరూ ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత మంత్రి కారులో ఎక్కి జూరాలను సందర్శించేందుకు వెళ్తున్న క్రమంలో మంత్రి కారు వెనుక ఇతర నాయకులు కార్లు ఒక్కసారిగా కాన్వాయ్‌గా వస్తున్నాయి. అయితే అన్ని కార్లను వదిలిన పోలీసులు ఒక్క అలంపూర్ ఎమ్మెల్యే కారును వదలక పోవడంతో వెంటనే కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు ఎమ్మెల్యేకు విషయాన్ని తెలుపడంతో ఆయన స్వయంగా వచ్చి పోలీసులకు చెప్పడంతో కారును కాన్వాయ్‌కు పంపారు. అన్ని కార్లను వదిలిన పోలీసులు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఒక్కకారును ఎందుకు ఆపారో? ఎవరు ఆపమన్నారో? అన్న విషయాలు మాత్రం అంతుచిక్కడం లేదు. ఈ ఘటనకు సంబంధించి బీఆర్‌ఎస్ కార్యకర్తలతో పాటు పలువురు సోషల్‌మీడియాలో వైరల్ చేయడం కొసమెరుపు.

కొందరు నాయకులకు మాత్రమే అనుమతి

గతంలో మంత్రులు రావడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయుల మధ్య వర్గపోరు ఉండటంతో ఈ సారి జిల్లా పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ప్రధాన నాయకులను మాత్రమే హెలీప్యాడ్ వద్దకు వదిలేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ క్రమంలో హెలిప్యాడ్‌కు వెళ్లే పాత కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు. అయితే కొందరిని వదిలి మరికొందరిని హెలిప్యాడ్ దగ్గరకు వదలకపోవడంతో ఓ నేత పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఘటన కూడా చోటు చేసుకొంది.

ప్రమాదంలోనే జూరాల ప్రాజెక్టు

- మంత్రి చెప్పిన మాటలు అబద్ధం
- సారంగంలో బురద పేరుకొని తేమ శాతం పెరిగితే భారీ నష్టం
- మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీకే భరత సింహారెడ్డి

గద్వాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు సురక్షితంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన మాటలు పూర్తిగా అబద్ధమని, ప్రాజెక్టు ప్రమాదంలోనే ఉందని మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి అన్నారు. శనివారం బంగ్లాలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్యాం నిర్మాణ సమయంలో సొరంగం ఉందని, దానిలోకి బురద వెళ్లిందంటే డ్యామ్ ఎప్పుడు తేమ శాతంతో ప్రమాదానికి గురికావచ్చని వివరించారు. సొరంగంలోకి వెళ్లడానికి రెండు లిఫ్టులు ఉన్నాయని అవి మూసుకుపోయి ఎనిమిదేళ్లు అయ్యిందని వివరించారు. ఏ ఒక్క అధికారి కూడా అందులోకి వెళ్లి సిల్ట్‌తో పాటు ఏమైన పేరుకు పోయిందా అని చూసేనాథుడే లేడన్నారు. ప్రాజెక్టులో సిల్ట్ పేరుకు పోయిందని దీంతో డ్యామ్ పునాదిపై ఒత్తిడి పెరిగిపోతున్నదని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ పరిస్థితి గురించి తెలియని మంత్రి ప్రాజెక్టు సేఫ్‌గా ఉందని చెప్పడం మంచిది కాదని హితవు పలికారు. లోపల ఉన్న 8 మీటర్లలో పేరుకుపోయిన సిల్ట్ తీయని ప్రభుత్వం, ప్రాజెక్టులో పేరుకుపోయిన సిల్ట్ తీస్తామని అంటున్నారని తెలిపారు. క్రస్ట్ గేట్లు తెగిపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పనులు చేసేవారికి బిల్లులు చేయకపోతే కాంట్రాక్టర్లు పనులు ఎలా చేస్తారని నిలదీశారు. ర్యాలంపాడు కాలువలు ఇప్పటి వరకు పూర్తికాలేదన్నారు. ఈ రిజర్వాయర్ లీకేజీలకు నాలుగేళ్లయినా అడిగేనాథుడే లేడన్నారు. గద్వాలలో పెత్తందారి వ్యవస్థ నడుస్తుందని వివరించారు. దీంతో ఉన్నోడి చేతిలోకి డబ్బు పోతున్నదని ఆరోపించారు. సీడ్ వ్యవస్థ మొత్తం నాశనమైందన్నారు. కొన్నేళ్లలో ఇక్కడ సీడ్ వ్యవస్థ ఉండదని చెప్పారు. గద్వాల అభివృద్ధి పూర్తిగా వెనకబడి పోయిందని విమర్శించారు.

కస్తూర్బాలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

కోడేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోడేరులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు పాఠశాల, కళాశాల ప్రత్యేకాధికారి ఎస్. కవిత ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. పదవ తరగతి పాసైన బాలికలు కస్తూర్బాలో ప్రవేశాలు పొంది నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్ ప్రవేశం పొందే విద్యార్థినులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సులో పరిమితి సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

అదే విధంగా డ్రాప్ అవుట్ అయిన పిల్లల కు, తల్లిదండ్రులు లేని పిల్లలకు, వలస వెళ్తున్న తల్లిదండ్రుల పిల్లలను పాఠశాలలో చేర్పించుకునేందుకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 9494885132కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

వస్తున్నారు.. వెళ్తున్నారు!

- నెల రోజుల సెలవుపై వెళ్లిన గట్టు తహసీల్దార్
- మూడు నెలల్లో ముగ్గురు తహసీల్దార్ల బాధ్యతలు



గట్టు తహసీల్దార్ కార్యాలయం

గట్టు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా గట్టు తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ సెలవులపై వెళ్లారు. ఈయన మే 28న తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు విజయవంతగా నిర్వహించిన అనంతరం నెల రోజులు కాకముందే సెలవుపై వెళ్లడం మండలంలో చర్చనీయాంశమైంది. స్వచ్ఛందంగా సెలవు పెట్టాడా? లేక మరేదైనా కారణం ఉందా? అన్న అనుమానాలు మండలంలో వ్యక్తం అవుతున్నాయి. తహసీల్దార్ మళ్లీ వస్తాడో.. రాడో అన్న సందేహాలు నెలకొన్నాయి. మండలానికి మూడు నెలల్లోనే ముగ్గురు తహసీల్దార్లు విధుల్లో చేరడం, ఏదో ఒక కారణం చేత బదిలీ అవ్వడమో, లేక సెలవు పెట్టడం జరుగుతుంది. సరితా రాణి అనంతరం భద్రప్ప తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కనీసం పది రోజులు కూడా ఉండకుండానే ఇతర మండలానికి బదిలీ అయ్యాడు. అనంతరం సలీముద్దీన్ బాధ్యతలు తీసుకుని, మూడు నెలలు కూడా గడవక ముందే నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలి అయ్యాడు. ఈయన అనంతరం మదన్‌మోహన్‌గౌడ్ విధుల్లో చేరాడు. నెల రోజులు తిరగక ముందే సెలవుపై వెళ్లాడు. ఇలా కనీసం ఏడాది కూడా కార్యాలయంలో విధులు నిర్వహించకుండా, బదిలీ అవుతుండడంతో మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఎఫ్‌ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా బాధ్యతలు తీసుకున్నారు.

ఉమమాహేశ్వర ఆలయానికి రూ. 25 లక్షల నిధులు

కోడేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయానికి రూ. 25 లక్షలు మంజూరైనట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దూరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ (సీజీఎఫ్) క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ నిధుల నుంచి ప్రస్తుతం రూ.25 లక్షలు మంజూర య్యాయని తెలిపారు. తదుపరి దశల వారీగా నిధులు మంజూరు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎండోమెంట్ అధికారులు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.



మెరుగైన సేవలు అందించాలి

- వైద్య సదుపాయాలపై సమీక్షించిన ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన వైద్య సేవలు అందించి, జిల్లా ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆరోగ్యశ్రీ సీఈవో ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలను వారు పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు ప్రత్యక్షంగా మెడికల్ కళాశాలను సందర్శించి కళాశాలలో వసతు లు, సౌకర్యాలు, సిబ్బంది, నిర్వ హణాపరమైన అన్ని విభాగాలను పరిశీలించి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించిన విషయాలను కలెక్టర్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆయా విభాగాల అధిపతులతో సమావే శమై అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించా రు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది, ఖాళీలు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకా కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాలనుగుణంగా సదుపాయాలు అందుబాటుల ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు.


మెడికల్ కాలేజీలో రికార్డులను పరిశీలిస్తున్న ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్

ఆయా విభాగాల్లో ఖాళీలు ఉంటే వాటి వివరాలను సమర్పించాలని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవికి సూచించారు. వీరి వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, వైద్య విభాగాల అధిపతులు, వైద్యులు, కళాశాల వైద్య అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని నియమిస్తాం

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి నసీమా సుల్తానా

కందనూలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : న్యాయ సేవాధికార సంస్థ తరపున ఖైదీలకు ఉచిత న్యాయవాదిని నియమిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నసీమా సుల్తానా అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం పట్టణంలోని సబ్ జైలును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలతో మాట్లాడుతూ వారికి కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే అలాంటి వారికి తమ సంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు.


జైలు పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ నసీమా సుల్తానా

వంట గదిలోకి వెళ్లి, వారికి వండిన ఆహార పదార్థాలను పరిశీలించడమే కాకుండా రుచి చూశారు. జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- కోటేశ్వర్, ఎంపీడీవో, నాగర్‌కర్నూల్



కందనూలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకనుగుణంగానే ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో కోటేశ్వర్ అన్నారు. లబ్ధిదారులకుప్రభుత్వ నిబంధనలకనుగుణంగానే ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గులు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మండలంలో ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి?

నాగర్‌కర్నూల్ మండలంలో ఇందిరమ్మ గృహాలు 537 మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటి వరకు 176 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందా?

ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల గ్రామాల్లో తాగునీటి కొరత లేదు.

పారిశుధ్య పనులు జరుగుతున్నాయా?

డ్రైనేజీల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఎప్పటికప్పుడు చేపడుతున్నాం. వర్షాకాలంలో ఎలాంటి అంటువ్యాధులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నాం.

మండలంలో అన్ని కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యం ఉందా?

మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వేను త్వరలో చేపట్టనున్నాం. ఒకవేళ వ్యక్తిగత మరుగుదొడ్లు లేకుంటే ప్రభుత్వపరంగా నిర్మించేందుకు చర్యలు చేపడతాం.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

- ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుకెళ్లి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో పనిచేస్తున్న ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని స్థానాలలో కాంగ్రెస్ పార్టీ నీ భారీ మెజార్టీతో గెలిపించే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అంతకముందు ముందు అమ్రాబాద్‌లో ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా నూతనంగా నిర్మించనున్న మురుగునీటి కాల్వ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే తనిఖీ చేసి


సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరి నారాయణగౌడ్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాసుమల్లు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు కుంద మల్లికార్జున్, బాల్ లింగం గౌడ్, చింతల రాజగోపాల్, రహీం, రేనయ్య, లక్ష్మణచారి పాల్గొన్నారు.

ప్రతీ ఆదివాసి కుటుంబానికి వైద్య సేవలు అందాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కేవీ స్వరాజ్యలక్ష్మి

- డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

కందనూలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఆదివాసి(చెంచు) కుటుంబానికి ఆరోగ్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో కేవీ స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం పీఎం జన్మన్ సంచార వాహన వైద్యాధికారులకు, ఇతర ఆరోగ్య సిబ్బందికి కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జనావాసాలకు దూరంగా ఉండే ప్రతీ చెంచు కుటుంబానికి వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమం కింద ఈ సంచార వాహన వైద్య సేవలు ప్రారంభించాలని తెలియజేశారు. ప్రతీరోజు చెంచు కుటుంబాలు నివసించే ఆవాసాలకు వెళ్లి వైద్య సేవలు అందించాలని తెలియజేశారు. గర్భవతులు, చిన్నారుల్లో రక్తహీనతను అరికట్టే విధంగా వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో అచ్చంపేట డివిజన్ డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ తారాసింగ్, డీపీవో రేణయ్య, సంచార వైద్యవాహన వైద్యాధికారులు, స్టాఫ్‌న ర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డీపీహెచ్‌ఎన్‌వో మంగమ్మ, సబ్‌యూనిట్ ఆఫీసర్ బికులాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కనీస వసతులు లేకున్నా జిల్లాలో ఐఐటీ ఇంటర్నేషనల్ పేరుతో ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి వేలకువేలు ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.అశోక్ డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని చాలాప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం వసతులు లేకున్నా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు శివరాం, నవీన్ పాల్గొన్నారు.

'ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి'

తిమ్మాజిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల్లో చైతన్యంతీసుకురావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ యువ సైన్యాన్ని కోరారు. మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ యూత్ విభాగానికి సంబంధించిన యువత, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువ సైన్యం కలిసికట్టుగా పని చేయాలని, కాంగ్రెస్ నాయకుల మోసాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ నాయకుల ప్రలోభాలకు గురి కావద్దని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, నాయకులు స్వామి, జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొత్త వెంకటేశ్, మాజీ కో ఆప్షన్ అయూబ్‌ఖాన్, ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

రాజాపూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

- విద్యార్థుల పస్తులు

కోడేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బందు కావడంతో విద్యార్థులు పస్తులు ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్వేరోస్ నాయకులు మబ్బు రాములు పాఠశాలను శనివారం సందర్శించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నానని ఆయన విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి ప్రారంభం కాగా నేటి వరకు కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించకపోవడం విచారకరమని అధికారులు నిర్లక్ష్యం ఎందుకు ప్రత్యేక కారణమని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి భాస్కర్‌శర్మను వివరణ కోరగా వంట బంద్ అయినది నిజమేనని, వంట ఏజెన్సీ వారు రాకపోవడమే కారణమన్నారు. గతంలో చేసిన ఏజెన్సీ వారు వస్తామని రాకపోవడంతో వేరే ఏజెన్సీకి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఏజెన్సీని ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు.

మానవత ఫౌండేషన్ సేవలు అభినందనీయం

వంగూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మానవత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎంఈవో మురళీమోహనా చారి అన్నారు. మానవత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పోల్కంపల్లి, కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని రూ.1 లక్షతో 150 మంది విద్యార్థులకు స్కూల్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ మానవత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ రమ్య, సౌజన్య సంవత్సర కాలంగా హెల్త్, ఎడ్యుకేషన్ సెక్టార్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయ మన్నారు. ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

దివంగత మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 104వ జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శనివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ బస్‌స్టాప్ వద్ద పీవీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి దుర్గి శ్రీకాంత్‌శర్మ మాట్లాడుతూ తొలి తెలుగు భారత ప్రధానిగా చేసిన పీవీ నరసింహారావు చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో నేడు దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసు కుపోతోందన్నారు. బహుభాషా కోవిదుడు పీవీ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు


జిల్లా కేంద్రంలో పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు భరత్‌కుమార్, జి.మురళీధర్‌రావు, ప్రకాష్‌శర్మ, వంశీమోహన్, ప్రసాద్‌రావు, పి.రామ్మోహన్, భార్గవి, హరికృష్ణశర్మ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి


ఊర్కొండ స్టేషన్‌లో ఎస్ఐ కృష్ణదేవకు సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

ఊర్కొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐ కృష్ణదేవకు తగు సూచనలు చేశారు. రికార్డు లను పరిశీలించారు. గ్రామాల సందర్శన ప్రతి రోజు ఉండాలని సూచించారు. వెంట కల్వకుర్తి సీఐ నాగరాజు ఉన్నారు.

'రాచాల యుగంధర్‌గౌడ్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్‌పై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దుండగులు పిరికిపందల్లా దొంగ చాటున దాడికి పాల్పడడం సరికాదని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ వల్లే జల దోపిడీ

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీఆర్‌ఎస్ వల్లే జల దోపిడీ జరిగిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికే ప్రాజెక్టులు కట్టారని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు.

'యువత వ్యాపారంలో రాణించాలి'

కల్వకుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : యువత వ్యాపారం వైపు పయనించాలని మాదిగ ఇండస్ట్రీయల్ చాంబర్ ఆఫ్ కామ్స్ ఇండస్ట్రీ (మిక్కీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమాపతి కోరారు. కల్వకుర్తి పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ ఆర్థిక సాధికారత కోసం మిక్కీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో మిక్కి జిల్లా అధ్యక్షుడు దుబ్బ నగేష్, జిల్లా కోశాధికారి బొల్లె రాజన్న, జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.రాజేందర్ ఉన్నారు.

'గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలి'

చారకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోకారంలో చేపడుతున్న రిజర్వాయర్ నిర్మాణ సామర్థ్యాన్ని తగ్గించాలని నిర్వాసితులు ప్రకాశ్, సంజీవనాయక్, మల్లేశ్, శ్రీను శనివారం పేర్కొన్నారు. గోకారం రిజర్వాయర్ నిర్మాణం చేపడితే ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా పూర్తిగా ముంపునకు గురవుతాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గించాలని కోరారు.

కిందపడి వ్యక్తి మృతి

వంగూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ ఓ వ్యక్తి బొక్కబోర్ల కింద పడి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాజర గ్రామానికి చెందిన హుస్సేన్(58) సర్వారెడ్డిపల్లిలో బంధువు చావు వెళ్లాడు. ఆ కార్యక్రమం అయిపోయాక అక్కడ మద్యం సేవించి గాజర వైపు కాలినడకన వస్తుండగా సర్వారెడ్డిపల్లి గేట్ సమీపంలో రోడ్డుపై బోర్ల పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొల్లాపూర్‌ను పారిశ్రామికంగా తీర్చిదిద్దాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ ఫయాజ్ డిమాండ్


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఫయాజ్

కొల్లాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో లభించే వనరులను వినియోగించుకొని కొల్లాపూర్ నియోజకవర్గాన్ని పాలకులు పారిశ్రామికంగా తీర్చిదిద్దాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ ఫయాజ్ డిమాండ్ చేశారు. శనివారం కొల్లాపూర్‌లోని ఎంజీకేఎల్ఐ అతిథిగృహం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫయాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేయడంలో చిత్తశుద్ధి చూయించడం లేదన్నారు. కొల్లాపూర్ నల్లమల అడవిలో లభిస్తున్న అమూల్యమైన ముడిసరుకు వెదురుబొంగు, సున్నపురాయి, సిమెంట్ రాయి, గ్రానైట్‌లను ఉపయోగించుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఇందిర, కొల్లాపూర్ మండల సీపీఐ కార్యదర్శి తుమ్మల శివుడు, కోడేరు మండల కార్యదర్శి కిరణ్ కుమార్, హైదరాబాద్ జిల్లా నాయకులు మామిడి చెట్ల వెంకటస్వామి, మండల నాయకులు యూసుఫ్ జంగం శివుడు, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

నాల్గవ రోజుకు చేరిన జర్నలిస్టుల రిలే దీక్షలు

కొల్లాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గం, పట్టణ జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం కొనసాగుతున్న దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరాయి. ఈ దీక్షలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి, జిల్లా నాయకులు మల్లికార్జున సాగర్, సీనియర్ జర్నలిస్టులు బచ్చలకూర కురుమయ్య, సీపీఐ నాయకులు కూర్చున్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ ఫయాజ్ మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు జర్నలిస్టుల సమస్యల గురించి ఆలోచించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. పాలకులు జర్నలిస్టుల న్యాయమైన ఆదివాసి ఎరుకల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ పాత్రికేయుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. మృతి చెందిన జర్నలిస్టు స్వేచ్ఛ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కొల్లాపూర్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అనంతరం స్వేచ్ఛ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు

పెంట్లవెల్లి, జూన్28 (ఆంధ్రజ్యోతి) : పదకొండేళ్లలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తెచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో బీజేపీ మండల కమిటి ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా శ్యామలాదేవి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపేట కురుమూర్తి, ఉపాధ్యక్షులుగా దేరంగుల విష్ణు, చట్టమోని తిరుపతయ్య, మూలే పద్మ, రాము, కార్యదర్శులుగా కుమార్, శంకర్, మాసుమ్, కోశాధికారిగా రవికుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్‌చంద్ర, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు వెంకటేష్,


పెంట్లవెల్లిలో మండల కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుధాకర్‌రావు

వెంకటస్వామి, అశోక్, శివ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి

కొల్లాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే అమలు పరచాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల దరఖాస్తులు తీసుకోవడం తప్పా అవి అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.

రేపు కవులు, కళాకారుల రాష్ట్ర స్థాయి సదస్సు

- తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్

కందనూలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక్ భవన్‌లో జరిగే కవులు, కళాకారుల రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వి.గోపాల్ అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ ప్రజా నాట్య మండలి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. కళాకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఐ జిల్లా కార్య దర్శి ఎం.బాలనరసింహ, నాయకుడు హెచ్.ఆ నంద్‌జీ, పీఎస్ఎం నాయకులు నరసింహ, విజేయుడు, నాయకులు మల్లేష్, పి.గోపాల్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కోడేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 13, 14 తేదీలలో గద్వాల పట్టణంలో జరగనున్న ఆవాజ్ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం అన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర ఆవాజ్ మూడవ మహాసభల కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీల హక్కులను కాలరాసే విధంగా కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వల్లి యాదయ్య, రెహమాన్, మక్బుల్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

- దళిత సంఘాల నాయకుల డిమాండ్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం పరిధిలోని నెల్లికొండలో దాడి చేసిన రామన్‌గౌడ్ అనే వ్యక్తిపై చర్యలు తీ సుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లైన్‌మన్ మల్లేష్‌ను అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ గూట విజయ్, పూలే, అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శివప్రసాద్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న పరామర్శించారు. లైన్‌మన్ మల్లేష్ మాట్లాడుతూ రామన్‌గౌడ్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించి చెయ్యి విరగొట్టి ఆసుపత్రి పాలు చేశాడని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మల్లేష్‌పై దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అశోక్, బోనాసి రాములు, యేసయ్య, తిరుపతయ్య, రాములు పాల్గొన్నారు.


జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లైన్‌మన్ మల్లేష్‌ను పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

కోడేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేద నిరుపేదలకు ఇల్లు లేని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాలలో వాస్తవ లబ్ధిదారులను గుర్తించలేదని, ఇందిరమ్మ కమిటీలపై పలువురు తమకు ఫిర్యాదు చేశారని ఆయన ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలను గుర్తించాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు పి.నరసింహ, పి.రవి, కాకం వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక

కొల్లాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కెమిస్ట్, డ్రగిస్టు అసోసియేషన్ జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి ఎన్నికలు జిల్లా కెమిస్టు భవనంలో జరిగాయి. జిల్లాలోని మెడికల్ షాపుల యజమానులు పాల్గొని జిల్లా అధ్యక్ష కార్యదర్శి కోశాధికారిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుతోట సాయిబాబు, సెక్రటరీగా వీరబొమ్మ సురేష్, కోశాధికారిగా నాగరాజు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా వారు కెమిస్టు, డ్రగిస్టు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు వెంకటేశ్వర్లు, రమేష్, స్థానిక ఎలక్షన్ అధికారులుగా సత్యం, శ్రీనివాసులు, రామకృష్ణ ఎన్నికలు నిర్వహించారు.


జిల్లా కమిటీకి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

సొంతింటి కల సాకారం చేసుకోండి

అచ్చంపేట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదల సొంతింటి కల సాకారం చేసుకోవాలని అచ్చంపేట ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం అచ్చంపేట మండలం చౌటుపల్లి, గుంపన్‌పల్లి గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో ఆధ్వర్యంలో లబ్ధిదారులు భూమి పూజలు నిర్వహించి ముగ్గులు పోశారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు, అచ్చంపేట మండల మాజీ ఎంపీపీ రాము, హౌసింగ్ ఏఈఈ, పంచాయతీ కార్యదర్శులు, మండల పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్